సాక్షి
కామారెడ్డి
సోమవారం। 25। ఆగస్టు। 2025



దేశ సేవకు మళ్లీ సిద్ధం

దేశానికి సేవ చేసేందుకు మాజీ సైనికులు సిద్ధంగా ఉంటారని జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బాపురెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



ఘనంగా తీజ్ ఉత్సవాలు

జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యం చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /21.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్ : జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఇందులో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.రవీందర్, కార్యదర్శిగా పి.బాలయ్య, కోశాధికారిగా కె.సురేందర్, ఉపాధ్యక్షులుగా ఎ.దత్తాత్రి, ఎ.అనంతరావు, ఎం.స్వామి, సంయుక్త కార్యదర్శులుగా కె.ఈశ్వర్‌కుమార్, డి.ప్రదీప్ దేశ్‌పాండే, నరేష్‌కుమార్, కార్యవర్గసభ్యులుగా జె.ప్రభులింగం, ఆర్.రవీందర్‌గౌడ్, మణికంఠ పటేల్, బాబాగౌడ్, పండరి గౌడ్, ప్రియాంక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మైలారం శ్రీనివాస్ తెలిపారు.

'ఆర్ఎస్ఎస్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

నాగిరెడ్డిపేట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సంఘ్ ఇందూరు విభాగ్ ప్రచార ప్రముఖ్ డాక్టర్ వారె దస్తగిరి పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని శ్రీ కోదండ రామాలయం కళ్యాణ మండపంలో స్వయం సేవకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ్ పంచసూత్రాలైన పర్యావరణం, సామాజిక సామరస్యం, స్వబోధ, పౌరమర్యాదలు, కుటుంబ జ్ఞానోదయం అంశాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, ప్రసాద్, భూపతి రాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్‌కు అవార్డు



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్ మోస్ట్ కాంపాజినేట్ సర్జన్ అవార్డును అందుకున్నారు. అత్యధిక సర్జరీలు చేసినందుకు ఆయనను ఈ అవార్డు వరించిందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన వరల్డ్ ఐకాన్ అవార్డుల కార్యక్రమంలో ఆయన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.


ఉమ్మడి జిల్లాకు రెండు సీవోఈ మైనారిటీ కళాశాలలు

కామారెడ్డి అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మైనారిటీ గురుకులాల విద్యాసంస్థలు(టెమ్రిస్) ఆధ్వర్యంలో రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) కళాశాలలు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని టెమ్రిస్ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి బషీర్ ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని నాగారం (బాలుర), ధర్మపురి హిల్స్ (బాలికల)లలో ఏర్పాటు చేసిన సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ కేటగిరీకి చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలు, జైనులు, సిక్కులతోపాటు నాన్ మైనారిటీ కోటా కింద అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్(89857 83112), ఆయేషా (85550 30851), ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి బషీర్ (98494 19469)ను సంప్రదించాలని సూచించారు.

డైట్‌లో స్పాట్ అడ్మిషన్లు

కామారెడ్డి అర్బన్: డైట్‌లో మిగిలిపోయిన సీట్లకు రెండో విడత స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ డైట్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ కళాశాలలో ఈనెల 26న, ప్రయివేట్ కళాశాలల్లో 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్హత పరీక్ష మెరిట్, రిజర్వేషన్‌ల ప్రకారం భర్తీ ఉంటుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని తెలిపారు.

సువర్ణ శోభితం..



నీలాకాశంలో ధవళ వర్ణంలో మెరిసిపోయే మేఘాలుంటాయి. వర్షించడానికి సిద్ధంగా ఉన్న కారు మబ్బులు అప్పుడప్పుడు దర్శనమిస్తాయి. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో ఆకాశం అరుణవర్ణంలో కనిపిస్తుంటుంది. కానీ ఆదివారం సూర్యుడు పశ్చిమ దిశలో సాగిపోతున్న సమయంలో ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. గగన వీధుల్లో నీలి మేఘాలు సూర్య కిరణాల కలయికతో బంగారు వర్ణంలోకి మారి ఆహ్లాదాన్ని పంచాయి. కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో

స్పాట్ అడ్మిషన్స్

- 26, 28, 29వ తేదీల్లో కౌన్సెలింగ్



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, అడ్మిషన్స్ కన్వీనర్ టీజీఎప్‌సెట్–2025 ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 26, 28, 29వ తేదీల్లో అర్హులైన అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్స్ ఇవ్వనున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), కంప్యూటర్ సైన్స్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), కంప్యూటర్ సైన్స్ (డాటా సైన్స్) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత కౌన్సెలింగ్‌లో సీట్లు అలాట్ అయినవారు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఈ డబ్ల్యూఎస్ కోటా నిబంధనలు స్పాట్ అడ్మిషన్స్‌కు వర్తించవని ప్రిన్సిపాల్ తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆయకట్టుకు భరోసా



అలుగు దూకుతున్న నర్వ కొత్త చెరువు



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు

- అలుగెల్లిన చెరువులు, కుంటలు
- నిండుకుండల్లా ప్రాజెక్టులు
- అన్నదాతల్లో ఆనందం



సింగీతం రిజర్వాయర్

నిజాంసాగర్ : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో ప్రధాన జలాశయాలతో పాటు చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి. దీంతో వానాకాలం సాగు చేస్తున్న పంటలకు భరోసా లభించినట్లయ్యింది. జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్, పోచారం ప్రాజెక్టులు, సింగితం రిజర్వాయర్, చెరువులు, కుంటలు, లిఫ్టులు, వ్యవసాయ బోరుబావుల కింద 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వర్షాధారంగా, ప్రధాన జలాశయాలు, చెరువులు, కుంటల కింద సాగు చేసిన పంటలకు వరుణుడి భరోసా లభించింది. ఇటీవల కురిసిన వర్షాలతో జలాశయాలు కళకళలాడుతుండడంతో ఈ సీజన్‌లో పంటలు గట్టెక్కుతాయన్న నమ్మకం రైతుల్లో పెరిగింది.

అలుగెల్లిన 780 చెరువులు, కుంటలు

జిల్లాలో 1,515 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో 780 చెరువులు వరద నీటితో అలుగెల్లాయి. మిగతా చెరువులు, కుంటలు 50 నుంచి 70 శాతం మేర నిండాయి. ఆయా చెరువుల కింద 90 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులు, కుంటలు ఆధారంగా సాగు చేసిన పంటలు ప్రస్తుతం ఉన్న నీటితో గట్టెక్కనున్నాయి.



నర్వ కొత్త చెరువు ఆయకట్టు కింద సాగవుతున్న వరి

బోనస్ కథ కంచికేనా?

సన్నవడ్లకు దక్కని ప్రోత్సాహకం

- మూడు నెలలు దాటినా అందని డబ్బులు
- జిల్లాకు రావాల్సింది రూ.89 కోట్లు
- ఒక్క సీజన్‌కే పరిమితం.. నిరాశలో రైతులు

సన్న రకాల సాగును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న బోనస్.. ఒక్క సీజన్‌కే పరిమితమయ్యింది. రబీలో సన్న వడ్లు పండించి కొనుగోలు కేంద్రాలలో విక్రయించిన రైతులకు ఇప్పటికీ ప్రోత్సాహకం అందలేదు. పంటను విక్రయించి మూడు నెలలు దాటినా బోనస్ రాకపోవడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు.



కామారెడ్డి క్రైం : జిల్లాలో గత యాసంగి సీజన్‌లో రైతులు 2,61,110 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 60 వేలకుపైగా ఎకరాల్లో సన్న రకాలున్నాయి. పంట కొనుగోలు కోసం 446 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వాటిలో 63 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నరకం ధాన్యాన్ని సేకరించడానికి కేటాయించారు. మార్చి నెలాఖరు నుంచి కొనుగోళ్లు ప్రారంభించి మొత్తం 3.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించారు. ఇందులో 1,78,416 మెట్రిక్ టన్నులు సన్న రకం ధాన్యం ఉంది. సేకరించిన ధాన్యానికి సంబంధించి సర్కారు రైతుల ఖాతాలలో మద్దతు ధరను మాత్రమే జమ చేసింది. బోనస్‌ను ఇప్పటి వరకు విడుదల చేయలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలలో సన్న వడ్లను విక్రయించిన 72,852 మంది రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. వారికి ప్రభుత్వంనుంచి రూ. 89 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తయి మూడు నెలలు గడిచినా బోనస్‌పై ఎలాంటి ప్రకటనా లేదు.

ఆందోళనలో అన్నదాతలు..

జిల్లా ప్రధాన పంట వరి. గతంలో రైతులు దొడ్డు రకాలనే ఎక్కువగా సాగు చేసేవారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామనడంతో ఈ మధ్య సన్నాల వైపు మళ్లారు. సహజంగా సన్నాల కంటే దొడ్డు రకాలకే దిగుబడి ఎక్కువగా వస్తుంది. యాసంగిలో సన్నాల దిగుబడి తక్కువగా ఉంటుంది. అయితే ప్రభుత్వం బోనస్ ఇస్తామనడంతో రైతులు ఆశతో సన్నాల సాగుపై దృష్టి పెట్టారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఎకరాకు రూ. 500 చొప్పున బోనస్ అందించింది. రబీకి సంబంధించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీలోనే బోనస్ ఇవ్వని సర్కారు.. ఖరీఫ్‌లో ఇస్తుందా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వకపోతే రైతులు మళ్లీ పాత పద్ధతిలో దొడ్డు రకాల సాగుకు మళ్లే అవకాశాలున్నాయి.

బోనస్ డబ్బులు రాలేదు



బోనస్ వస్తుందన్న ఆశతో మా ఐదుగురు అన్నదమ్ములం యాసంగిలో దాదాపు 10 ఎకరాల్లో సన్న రకం వడ్లు పండించాం. వడ్లు అమ్మి నాలుగు నెలలవుతోంది. ఇప్పటికీ బోనస్ డబ్బులు పడలేదు. వ్యవసాయానికి ఖర్చులు బాగా పెరిగాయి. కష్టంగా ఉంది. ప్రభుత్వం బోనస్ డబ్బులు ఇవ్వాలి.
– బర్దావల్ గురుదాస్, టికారాం తండా, పెద్దకొడప్‌గల్

పెట్టుబడులకు కష్టంగా ఉంది



రబీ సీజన్‌లో ఐదు ఎకరాల్లో సన్న రకం వరి పండించాను. కాంటా చేసి మూడు నెలలు దాటింది. ఇప్పటికీ బోనస్ రాలేదు. ప్రస్తుతం పత్తి, సోయా సాగు చేస్తున్నాను. ఎరువులు, పురుగు మందులు కొనాలంటే డబ్బులు సర్దుబాటు కావడం లేదు. పెట్టుబడులకు కష్టంగా ఉంది. వెంటనే బోనస్ విడుదల చేయాలి. – గొర్రె పండరి, రైతు, పెద్దకొడప్‌గల్

ప్రభుత్వానికి నివేదించాం..

జిల్లాలో గత యాసంగి సీజన్‌లో రైతులనుంచి సేకరించిన వడ్లకు సంబంధించి రూ. 89కోట్లు రావాల్సి ఉంది. ఈ విషయమై అన్ని వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. బోనస్‌పై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్కారు నిధులు విడుదల చేయగానే నేరుగా రైతుల ఖాతాలలోనే డబ్బులు జమ అవుతాయి.
– శ్రీకాంత్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, కామారెడ్డి

ఆవిష్కరణలకు ఆహ్వానం

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ కృషిచేస్తోంది. ఇందుకోసం ఏటా 'ఇన్‌స్పైర్ మానక్' కార్యక్రమం నిర్వహిస్తోంది. దీని ద్వారా విద్యార్థుల నుంచి కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలను ఆహ్వానిస్తోంది. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి అవార్డులు అందిస్తోంది. ఈ ఏదాది దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఉంది.

పాఠశాలల్లో 'ఇన్‌స్పైర్ మానక్'

- భావిభారత శాస్త్రవేత్తలను తయారుచేయడమే లక్ష్యం
- ప్రాజెక్టు ఎంపికైతే విద్యార్థికి రూ. 10 వేల ప్రోత్సాహకం
- వచ్చేనెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం



బాన్సువాడలో ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు (ఫైల్)

బాన్సువాడ రూరల్ : విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ 2020–21 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్‌కు శ్రీకారం చుట్టింది. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల్లో దాగివున్న శాస్త్ర సాంకేతిక ప్రతిభను వెలికి తీయడానికి అప్పటినుంచి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. విద్యార్థులు తమ ఆలోచనలు, ఆవిష్కరణలను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే వాటిని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు పరిశీలిస్తారు. దేశవ్యాప్తంగా లక్ష ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కో ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి, విద్యార్థులను మరింతగా శాస్త్ర సాంకేతిక రంగంలో ఆసక్తి కనబర్చడానికి రూ.10 వేల చొప్పున విద్యార్థి బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తారు. తద్వారా ప్రాజెక్టును రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లే అవకాశం కలుగుతుంది.

జిల్లావ్యాప్తంగా 10శాతం ప్రాజెక్టులు ఎంపిక..

గతేడాది కామారెడ్డి జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు సుమారు 872 ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలనుంచే నామినేషన్లు వచ్చాయి. వాటిలో 85 ఆవిష్కరణలను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎంపిక చేశారు. ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ. 10 వేల చొప్పున బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. అయితే ప్రైవేట్ పాఠశాలలు ఈ కార్యక్రమాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రయివేట్ పాఠశాలలు సైతం ఇన్‌స్పైర్ మానక్‌పై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది.

గురువులదే బాధ్యత

విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. తల్లిదండ్రుల్లో చాలా మందికి ఇన్‌స్పైర్ మానెక్ కార్యక్రమంపై పెద్దగా అవగాహన ఉండదు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్‌నెట్ సమస్య కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులే బాధ్యత స్వీకరించి తమ స్కూల్ విద్యార్థులను ప్రోత్సహించి, వారి ఆవిష్కరణలను రిజిస్ట్రేషన్ చేయిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. నామినేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. https://www.inspireawards-dst.gov.in/ ద్వారా తమ ప్రాజెక్టులను సెప్టెంబర్ 30లోపు నమోదు చేయాలి. జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ మానక్ రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన అనుమానాల నివృత్తి కోసం జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డిని 94404 14250 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

ఐడియా బాక్స్ ఏర్పాటు చేశాం



జిల్లాలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు సుమారు 500 వరకు ఉన్నాయి. ప్రతి పాఠశాల నుంచి కనీసం 5 ప్రాజెక్టులు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం పాఠశాలల్లో ఐడియా కాంపిటీషన్ బాక్సులు ఏర్పాటు చేసి సైన్స్ ఉపాధ్యాయుల సేవలు తీసుకుంటున్నాం.
– సిద్ధరామిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కామారెడ్డి

ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి



సైన్స్ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను ప్రోత్సహిస్తే ఎన్నో ఆవిష్కరణలు వచ్చే అవకాశాలుంటాయి. ఆ దిశగా కృషి చేయాలి. ఇన్‌స్పైర్ మానక్‌కు రిజిస్ట్రేషన్లు ఊపందుకునేలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి.
– రాజు, జిల్లా విద్యాశాఖాధికారి, కామారెడ్డి

క్లుప్తంగా

వంగిన విద్యుత్ స్తంభాలు..



మద్నూర్(జుక్కల్): గోజేగావ్, సోనాల గ్రామాలకు వెళ్లే రహదారి పక్కన విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు సైతం తెగిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పశువులు, ఎడ్లబండ్లపై వెళ్లే వారు విద్యుత్ తీగల వద్ద వంగి జాగ్రత్తగా వెళ్తున్నారు. విద్యుత్ తీగలను గమనించకపోతే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

షబ్బీర్ అలీ జీవన ప్రస్థానం పుస్తకావిష్కరణ



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ 45 సంవత్సరాల రాజకీయ జీవన ప్రస్థానం పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కేబినెట్ మంత్రులు పాల్గొన్నారు. ఆయన 45 సంవత్సరాలుగా ఒకటే పార్టీలో ఉంటూ ఆయన చేసిన సేవలు, రాజకీయ ప్రస్థానం గురించి ప్రత్యేక పుస్తకాన్ని ముద్రించారు.

అ'పూర్వ' సమ్మేళనం



సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85 పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొదటగా పదో తరగతి బ్యాచ్‌కు చెందిన గంగాగౌడ్, సత్యనారాయణ, బాలకిషన్, నారాయణ వివిధ కారణాలతో మరణించారు. వారికి సంతాపం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి

- బాన్సువాడలో విచ్చలవిడిగా విక్రయాలు
- రోజువారీ కూలి పనులు చేసుకునే యువతే లక్ష్యంగా దందా
- టీ పాయింట్లు, శివారు ప్రాంతాలే అడ్డా..
- నెల రోజుల్లో 575 గ్రాముల గంజాయి పట్టివేత



బాన్సువాడలో ఇటీవల ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేస్తున్న గంజాయి (ఫైల్)

బాన్సువాడ: గంజాయి విక్రయాలకు బాన్సువాడ కేరాఫ్‌గా మారింది. రెండు రాష్ట్రాల సరిహద్దులకు దగ్గరగా ఉన్న బాన్సువాడలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. బాన్సువాడ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి బాన్సువాడలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా రోజువారీ పనులు చేసుకునే యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి దందా సాగిస్తున్నారు. తాజాగా బాన్సువాడ సమీపంలోని బీర్కూర్ చౌరస్తా వద్ద 300 గ్రాముల గంజాయిని తీసుకెళ్తున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ నెలలోనే బాన్సువాడలో 575 గ్రాముల గంజాయిని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

గ్రాముకు రూ.500 చొప్పున విక్రయం..

బాన్సువాడలో యువత, కార్మికులను టార్గెట్ చేసుకొని గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా టీ పాయింట్లు, ఖాళీ ప్రదేశాలు, గ్రామ శివారు ప్రాంతాలను అడ్డాగా చేసుకొని గంజాయి దందా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సంగమేశ్వర కాలనీ, గౌలీగూడ తదితర కాలనీల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే గంజాయికి అలవాటుపడిన వారిలో అధికంగా యువత ఉండడం, అందులోనూ వివిధ పనులు చేస్తూ కార్మికులుగా జీవనం సాగిస్తున్న వారే ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. రోజువారీగా కూలి పనులు చేసుకునే వారు సైతం గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. మరో వైపు గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వారిలో యువతే ఉండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. బాన్సువాడలో మత్తు పదార్థాలకు బానిసగా మారిన యువకులు పదుల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. నిఘా పెట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సమాచారం ఇస్తే తప్ప అటు వైపు దృష్టి సారించకపోవడం గమనర్హం.

ఇటీవల పట్టుకున్న ఘటనలు..

- ఈ నెల 6న బాన్సువాడ పట్టణంలో ఓ హోటల్ సమీపంలో దాసరి పోశెట్టి అనే వ్యక్తిని గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో 275 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 23న బాన్సువాడ సమీపంలో బీర్కూర్ చౌరస్తా వద్ద గంజాయి తీసుకొస్తున్న దెగ్లూర్‌కు చెందిన అర్జున్ అనే వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకుని 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై బాన్సువాడ ఎక్సైజ్ సీఐ దిలీప్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

అంత్యక్రియలకు నిరీక్షించాల్సిందేనా?

- ఆఖరి మజిలీకి జాగ కరువు
- రామారెడ్డిలో అంత్యక్రియలకు అవస్థలు



పటేల్ చెరువు చివరలో అంత్యక్రియలు నిర్వహించే స్థలం

రామారెడ్డి: రామారెడ్డిలో సగం జనాభాలో ఎవరైనా చనిపోతే పటేల్ చెరువు వైపు, సగం జనాభా చింతలకుంట వైపు, కొంత మంది సొంత స్థలాల్లో అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. చింతలకుంట వైపు వైకుంఠధామం నిర్మించడంతో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ పటేల్ చెరువు వైపు అంత్యక్రియలు నిర్వహించే వారికే శవం కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించింది. ఒకేరోజు ఇద్దరు చనిపోతే ఒక శవానికి అంత్యక్రియలు పూర్తయ్యేదాకా మరో శవం నిరీక్షించాల్సిందే. ఎందుకంటే అక్కడ ఉన్నది ఆరు గజాల జాగే. ఆ అంత్యక్రియలు నిర్వహించేది కూడా పటేల్ చెరువు చివరిలోని 6 గజాల స్థలంలో మాత్రమే. ఆ ఆరు గజాల స్థలంలో నీళ్లు నిండితే అంత్యక్రియలకు జాగే ఉండదు. 2024 నవంబర్‌లో ఒకే రోజు ముగ్గురు చనిపోయారు. ఒకరి తర్వాత ఒకరు అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. అదృష్టం ఏంటంటే ముగ్గురిదీ కూడా దహన సంస్కారాలే ఉండటంతో అది సాధ్యమైంది. ఖననం చేయాల్సి వస్తే చాలా ఇబ్బంది పడేవారు.

స్పందించిన ఎమ్మెల్యే....

గతంలో అంత్యక్రియలకు సంబంధించిన సమస్యను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. డీఆర్డీవోను గ్రామానికి పంపి మరో వైకుంఠధామం నిర్మించాలని ఆదేశించారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే 8,822 జనాభా ఉంటుంది. ప్రస్తుత ఆ జనాభా రెట్టింపైంది. అధికారుల నిర్లక్ష్యంతో చివరికి శవాలు కూడా అంత్యక్రియలకు నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కల్పించుకొని రామారెడ్డిలో మరో వైకుంఠధామం నిర్మించి తమ అంత్యక్రియల కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ సేవ చేసేందుకు మళ్లీ సిద్ధం



తిప్పాపూర్‌లో సమావేశమైన మాజీ సైనికులు

భిక్కనూరు: దేశ సేవ చేసేందుకు ఎల్లప్పుడు మాజీ సైనికులు సిద్ధంగా ఉంటున్నారని కామారెడ్డి జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. ఆదివారం తిప్పాపూర్‌లో జిల్లా స్థాయి మాజీ సైనికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, సంఘ భవన నిర్మాణానికి వెయ్యి గజాల స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. త్వరలోనే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సహకారంతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కామారెడ్డి జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమం కోసం అవసరమైన వాటి గురించి విన్నవిస్తామన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో సైనికుల కోసం ఆర్మీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతామన్నారు. గతంలో ప్రభుత్వం సైనికులకు ఇచ్చిన భూములలో కొందరివి ఆక్రమించుకున్నారని వాటిని ప్రభుత్వం తిరిగి వీరికి ఇప్పించాలన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా సైన్యంలో చేరే యువతకు శిక్షణ ఇస్తామన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి బీంరెడ్డి, సాయిరెడ్డి, మరో 50 మంది మాజీ సైనికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన యూనియన్ ఐదవ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో కార్మికులు చాలీచాలని వేతనాలకు వెట్టి చాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలన్నారు. ప్రతి నెలా 1న కార్మికుల బ్యాంక్ అకౌంట్‌లో వేతనాలను వేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజనర్సు, మహబూబ్ అలీ, నాయకులు అరుణ్, దీవెన, కార్మికులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల వితరణ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మహదేవ్ గుప్తా

రాజంపేట: వినాయక చవితిని పురస్కరించుకుని రాజంపేట వాస్తవ్యుడు కొండ మహదేవ్‌గుప్తా (రామకృష్ణ మెడికల్) ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట ఆర్యవైశ్య సభ్యులకు మట్టి వినాయకులను అందజేసినట్లు గ్రామ ఆర్యవైశ్య అధ్యక్షుడు ముత్యపు సిద్ధరాములు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న కొండ మహదేవ్ గుప్తాకు రాజంపేట ఆర్యవైశ్య సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మొగిలిపల్లి రమేష్, రాజు, బంధం అనిల్, రాజు పాల్గొన్నారు.



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న బల్ల అంజనేయులు, అనిల్

రాజంపేటలో.. విగ్రహాల పంపిణీ

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన బల్ల ఆంజనేయులు అనిల్ ఆదివారం కామారెడ్డి పరిధిలోని ఆంజనేయ ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో వేయి మందికి మట్టి వినాయకులను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడటంలో తన వంతు బాధ్యతగా 5 సంవత్సరాలుగా ఈ మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు గుర్రాల రవికుమార్, వడ్ల రవి, అంజగౌడ్, సాయి, భాస్కర్, మహేష్, పిట్ల సింహం పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబురాలు



ఎల్లారెడ్డి: సోమర్యాగడితండాలో ఆదివారం తీజ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన తీజ్ ఉత్సవానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రావణమాసంలో పెళ్లికాని యువతులు గోధుమ బుట్టలతో తీజ్ మాతను పూజిస్తారని అన్నారు. ఆచారంగా వస్తున్న ప్రతీ పండగను ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. బంజారా సంఘం నాయకులు రాములు, సర్దార్ ఉన్నారు.

గజ్యానాయక్‌తండాలో..



మాచారెడ్డి: గజ్యానాయక్ తండాలో ఆదివారం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు 9 రోజుల పాటు నిష్టతో గోధుమ కుదుళ్లపై నీళ్లు పోసి తొమ్మిదవ రోజు ఆ కుదుళ్లతో డీజే వాయిద్యంతో వారి సాంప్రదాయ నృత్యాలు చేస్తూ బతుకమ్మలను ఊరేగించిన అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

కొట్టాల్‌గడ్డతండాలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): కొట్టాల్‌గడ్డ తండాలో ఆదివారం గిరిజనులు తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోధుమ నారుతో సేవాలాల్ మందిరం వరకు ర్యాలీగా చేరుకొని సేవాలాల్, జగదాంబ మాతామాలకు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ గ్రంథాలయ చైర్మన్, జిల్లా జాగృతి అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ నిల్వల పట్టివేత



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో అక్రమ మద్యాన్ని పట్టుకొని నిర్వాహకుడిపైఉ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావ్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని తిమ్మనగర్ రోడ్డులో ఉన్న సాయి కూల్‌డ్రింక్స్ షాప్‌లో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. దాడిలో 25 లీటర్ల మద్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. షాపు యజమాని పై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



కామారెడ్డి క్రైం: క్షణికావేశంలో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం కొట్టాల్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బచ్చగారి రాజమణి(50) భర్త విఠల్ గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. చేసిన అప్పులు తీరలేదు. దీంతో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. భార్యా భర్తల మధ్య ఆదివారం ఉదయం మరోసారి గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన రాజమణి సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని మోతీరాంనాయక్ తండా వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై జాడె సుస్మిత ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాల్పోల్ తండాకు చెందిన హీరాబాయి నగరంలో నివాసం ఉంటోంది. తండాలో తీజ్ వేడుకలు ఉండటంతో యాక్టివాపై వెళ్తుండగా, మోతీరాంనాయక్ తండా వద్ద బైరాపూర్ శివారులోని పోచమ్మ తండాకు చెందిన బానోత్ మంగూరామ్ వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ప్రమాదంలో హీరాబాయి కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో..



కామారెడ్డి క్రైం: కామారెడ్డి మునిసిపల్ పరిధిలోని టేక్రియాల్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ సబ్ ఇంజినీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాన్స్‌కో జిల్లా కార్యాలయంలోని టెక్నికల్ విభాగంలో పని చేస్తున్న దేవీ ప్రసాద్ విధుల్లో భాగంగా టేక్రియాల్ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

దాబా నిర్వాహకుడిపై కేసు

గాంధారి: మండల కేంద్రంలోని దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ దాబాలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా సిట్టింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకుడు అన్వేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాబాలు, హోటళ్లలో ఎవరైనా అనుమతి లేకుండా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

మూడు టిప్పర్లు, పొక్లెయిన్ సీజ్



బాన్సువాడ: బీర్కూర్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లు, పొక్లెయిన్ సీజ్ చేసినట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో మూడు టిప్పర్లను, పొక్లెయిన్ ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి



రాజిరెడ్డి (ఫైల్)

భిక్కనూరు: దుక్కిదున్నుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం నర్సన్నపల్లికి చెందిన చిదుర రాజిరెడ్డి(46) జంగంపల్లి శివారులో ఉన్న రాజంపేట మండలం బస్వన్నపల్లికి చెందిన ఆశిరెడ్డికి చెందిన ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఆదివారం ఆ భూమిని దున్నేందుకు రాజిరెడ్డి తన ట్రాక్టర్‌తో ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. పొలం దున్నుతుండగా బోరు బావికి కనెక్షన్ ఇచ్చిన సర్వీస్ వైరు ట్రాక్టర్‌కు తగులుతుందని దానిని పైకి లేపే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించడంతో రాజిరెడ్డి ట్రాక్టర్‌పైనే ప్రాణాలు విడిచాడు. కొద్ది సేపటికి అటు వైపుగా వెళ్లిన రైతులు విషయాన్ని గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జల్లాపల్లి ఫారంలో యువకుడు..

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం కు చెందిన షేక్ ముబీన్ (30) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సునీల్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ముబీన్ తన స్నేహితులతో కలిసి శనివారం చేపలు పట్టేందుకు స్థానిక గ్రామ చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ తీగ తగిలి కిందపడిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ముబీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ముస్కాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్‌లో చిన్న గంగారాం(60) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న గంగారాం గ్రామంలో పనులు చేస్తూ జీవిస్తున్నాడు. భార్య మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. కుమారుడు, కోడలు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా ఆదివారం ఉదయం కుమారుడు తండ్రి గంగారాంకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఇంటి పక్కన ఉన్న వారికి సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా ఇంటి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉందని, కిటికీల నుంచి చూడగా విగతజీవుడిగా ఉన్నట్లు కుమారుడికి సమాచారం అందించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

బీబీపేట: ప్రమాదవశాత్తు బావిలో జారిపడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన పిప్పిరి శెట్టి దేవయ్య శనివారం సాయంత్రం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ మోటారు మరమ్మతుల కోసం బావిలోకి దిగే ప్రయత్నంలో జారిపడ్డాడు. అంతలోనే ఫిట్స్ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఉదయం పొలంలోని బావిలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తుల సహాయంతో నీటిని మోటార్ల ద్వారా తీయించారు. మృతుడి భార్య దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

సదాశివనగర్: భార్యను బండరాయితో హత్య చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సదాశివనగర్ పీఎస్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన చిందం రవి, లక్ష్మి భార్యా భర్తలు. వీరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున భార్యాభర్త మధ్య గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన రవి భార్యపై బండరాయితో మోది హత్య చేశాడు. హత్యకు ఉపయోగించిన బండరాయిని, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. హత్య కేసును చేధించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై పుష్పరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీపీడీఈఏ సర్కిల్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



సుభాష్‌నగర్: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ (టీపీడీఈఏ) నిజామాబాద్ సర్కిల్ కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ నరేందర్ ఎన్నికల అధికారిగా, సర్కిల్ సెక్రెటరీ సంపత్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అంతకుముందు జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి రాజేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కంపెనీ జనరల్ సెక్రెటరీ నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు హాజరయ్యారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ నరేందర్, కంపెనీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మల్లికార్జున్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తోట రాజశేఖర్, కంపెనీ జాయింట్ సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌నారాయణ, సర్కిల్ కార్యదర్శి ఏ కాశీనాథ్, కోశాధికారి పి శ్రీనివాస్, మహిళా ప్రతినిధి ఆర్ సుమిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి తేజ, ఆఫీస్ సెక్రటరీ కెఎస్ఆర్ మూర్తి, డివిజన్ సెక్రెటరీలు జి శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్, నాయిని కృష్ణ, శంకర్ గౌడ్, గంగాధర్, కోశాధికారులు భరత్, గిరిధర్, భరత్ కుమార్, కాంతారావు, జుబేర్, ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

టీచర్ సస్పెన్షన్

నిజామాబాద్ అర్బన్: నందిపేట మండలం కుద్వాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శంకర్‌ను సస్పెన్షన్ చేస్తూ డీఈవో అశోక్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థులను కొట్టడం, వారి కళ్లల్లో కారం చల్లడం వంటి ఆరోపణలు రావడంతో ఎంఈవో గంగాధర్ చేపట్టిన విచారణ, నివేదిక ఆధారంగా సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారు.

గోల్డ్‌షాప్‌కు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఓ గోల్డ్ షాప్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బంజ ప్రభులింగం అనే వ్యక్తి గోల్డ్‌షప్ ఫర్నీచర్ కోసం ఓ దుకాణంలో పనులు చేపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పనులు జరుగుతున్న షాప్‌లోకి చొరబడి ఫర్నీచర్‌కు నిప్పంటించారు. ఈ ఘటనలో కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ఘటనలో మండల కేంద్రానికి అవుసుల శ్రీధర్ పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.